# అంత్య విశ్వాసము

• శ్రీమతి తంగిరాల శకుంతలాదేవి •

"ఎక్కడికత్తా వెడుతున్నావూ, కాలవకా?"

"ఎవరే, నువ్వా. కాలవకే, మడికట్టుకోవద్దూ"

ఇందాక సున్నానికి కబురుచేశావు ఎవరికైనా దెబ్బ తగిలిందా?"

ఆ ఏదో సామెత చెప్తారుచూడు, "వేలుమీద గోరు మొలిచింది, వెర్రిమొగడా వేరుందాం" అని అట్లాగే కోడలుకి ఎక్కడో చిన్న ముల్లు గుచ్చుకుందమ్మా ఇహ చూసుకో, రాత్రి పగళ్లు ఏకంచేసి గడబిడ చేస్తోందికదా అసలేవాడు పంచప్రాణాలు దానిమీద పెట్టుకుని బ్రతుకుతూ వుంటే, వాడిని మరింత హడలకొట్టేస్తోందికదా!

"అట్లాగా పాపం, ఎందుకు గుచ్చుకుందీ?"

"ఏం చెప్పమంటావు మా ప్రారబ్ధం. భార్య, భర్త ఇద్దరూ పెరట్లో ఏదో పూలమొక్క నాటుదామని వెళ్లారటమ్మా ఆవిడే పాతాలా ఏమిటే, అక్కడికి తనే అంత పనిచేస్తున్నట్లు నటనతప్ప (మెల్లిగా) "అసలింతకీ గుచ్చుకుందోలేదో, ఇంక ఆవిడగారి నటన ఏంచెప్పను. ఒక కాచటమేనా, ఒక కట్టుకట్టటమేనా ఎంత ఆవస్థ పడుతున్నానో ఆ పరమాత్ముడికెరుక అసలు మొదటనే చెప్పా. "నాయనా, చదువుకున్నవాళ్లు మనకి సరిపడరురా" అని విన్నాడా చదువో, చదువో అని అఘోరించాడు తనుమాత్రం ఏం సుఖపడుతున్నాడు. మూడేసిరోజుల కొకసారి ముహం ముడవటమేగా ఏమిటో ఇంతకీ మా అదృష్టం ఇట్లావుంది "ఆర్నెల్లు ఉపవాసం చేసినా ఆరోజు జొన్నకూడే"నని

"నువ్వు మరీచెబుతావత్తా, మీకోడలు చాలామంచిదని ఇరుగు పొరుగు అంతా మెచ్చుకుంటూవుంటే"

"ఏం మంచే, కామంచి, నాకు పనికిరానిమంచి నాకెందుకే తల్లీ. మారోజుల్లో ఇట్లాగే వున్నామటే, ఎన్ని దెబ్బలు తగిలాయి, ఎన్ని ముళ్లు గుచ్చుకున్నాయి. నేను బ్రతికున్న రోజుల్లో ఒకసారి పొలంలో గడ్డి ఇంటికి తీసుకొస్తూవుంటే, ఎంత ముల్లు గుచ్చుకుందనుకున్నావు పాపం, మీ మామగారు అప్పుడు . . నా అమ్మ కడుపుకాలి, తనచేత్తో ముల్లు తీసి, పాపం చాలా ఉపచారం చేశారు. నా సుఖమంతా ఆయనతోటే పోయింది, ఇంతకీ ఒక్కమాట ముసలిముండను, నే వున్నాగదే. చాకిరీచేయించుకోటానికి దానికేమమ్మా మహారాణిలాగ మంచమెక్కి, వాడిచేతే చేయించుకుంటుంది"

"అట్లా అనకత్తా, నిజంగా బాధగానే వుందేమో."

"వుండటానికి వుండా, బూవా, ఏదోకాస్త ముల్లు విరిగింది, అదేపోతుంది."

"ఇంకేముల్లు గుచ్చుకున్నా అంతబాధగా వుండదు. ఈతముల్లుమాత్రం చాలా బాధపెడుతుంది ప్రమాదం కూడాట."

"సాగితే అన్నీప్రమాదాలే. పెద్దముండనికదా, కాస్త ఏపనికో, పాటకో, సాయంలేదుకదా, మొగుడు ఇంట్లో ఉన్న నాలుగు ఘడియలూ ఏం సంతోషంగా తిరుగుతుందో అంతే అప్పైన పుస్తకం పుచ్చుకుని "రాజెవరి కొడుకా" అని కూర్చుంటుంది

"పోనీ రాత్రిళ్లు వాళ్ళని వండుకోమనకపోయావూ?"

"ఆ భగ్గు వెలుగు. వంటకూడాను. ఆ మాల గుడ్డలతో. అంటూ, "సొంటూ ఏమీలేదుకదా. అంతా పరబ్రహ్మస్వరూపమే. అదేమే అంటే అడిగినమాటకు సమాధానం కూడా రాదు."

"మొదట్నించీ బస్తీలో పెరిగిన పిల్లాయె నీ ఆచారం రమ్మంటే ఎట్లా వస్తుందే ఏదో సర్దుకుపోవాలికాని"

"అయితే మీరంతా పెరగలేదుటే అమ్మాయీ."

"సరే! మాసంగతే అడిగావు మా వారు రోజూ చెప్తూనే వుంటారుకదా చదువురాని మొద్దును కట్టుకున్నానని"

"పోన్లేమ్మా, అంటే అంటాడు నిక్షేపంగా పనీ, పాటా చేసుకుంటున్నావు, నీకేంతక్కువా? సంసారం చక్కగా దిద్దుకుంటున్నావు. మా మొహాన ఆయోగం

కూడా లేదుకదా వెడతా. మడికట్టుకుంటాను అబ్బాయి భోజనానికొస్తాడు."

"ఎప్పుడన్నా వస్తూవుండత్తా"

"అట్లాగేనమ్మా ఇంట్లో తీరుబడికావద్దూ"

౨

"కమలా, కమలా,

"ఆ, వస్తున్నా. ఏమిటిం"

"ఈపూట ఎట్లావుందే నెప్పి, కాస్త తగ్గిందా"

"ఏం తగ్గటం చచ్చిపోతున్నాను-బాధపడలేక మంటా పోటు కూడాను"

"అమ్మని కాసిని వేడినీళ్ళు పెట్టి యిమ్మనుపోయావు, కాస్తే తగ్గుతుందేమో"

"అమ్మ పెట్టినట్లే వున్నారు ఆవంట కాస్తా చేసి బయటపడేటప్పటికి ఆవిడ పని అయిపోతోంది ఇంకా నాకెంచేస్తారు ఈరోజుకు నాలుగు స్నానాలయ్యాయి. ఇంకా ఎన్నిచెయ్యాలో ఈనాల్గు రోజులనుంచే పనిచెయ్య లేక పోవటంవల్ల వూరువాడకూడా ఏకం చేస్తున్నారు మాకోడలు చమవుకుంది, పనిచెయ్యదనిన్ని"

"ఏదో కాస్త పెద్దది మనం కాస్త వూరుకుంటే అదే పోతుందే."

"వూరుకోక నేనేమంటున్నానూ ఒక చెంప నాబాధ. మరోచెంప ఈ సాధింపు ఏమిటో నాఅవస్త నాదే"

"ఇదిగో డాక్టరు ఈమందు రాసి, కాస్తకాచమన్నాడు నేను త్వరగా ఆఫీసుకెళ్ళాలి"

"పోనీ నన్ను మా అమ్మదగ్గిరకి పంపండి. తగ్గిన తర్వాతవస్తాను" (లోపల్నించి 'ఆబ్బాయి అన్నానికిరారా')

"ఆ, వస్తున్నానమ్మా"

"వెళ్ళిరండి, మీరు భోజనంచేసి రండి"

(భోజనం చేస్తూ)

"కమలకి కాస్త వేడినీళ్లు పెట్టి కాచాలమ్మా"

"అయ్యో, అట్లాగేనాయనా, నాతో ఏమన్నా చెపు తుందా ఏమన్నానా అసలు దానికి ఓర్పు తక్కువరా. నువ్వుచూడు నూటనాలుగు జ్వరం వచ్చినా పడుకునే వాడివికావు నిన్నెంత గారాబంగా చూశానో, ఇప్పుడంత కష్టపడుతున్నావు, నా ప్రాణం కొసేసినట్లుంది"

"నేనేం కష్టపడుతున్నానమ్మా కమల చాలా బాధ పడుతోంది. నేను చెయ్యకపోతే మరెవ్వరుచేస్తారమ్మా కిమలకి"

"ఏమో నాయనా. మా కాలంలో పెనిమిటిచేత గుక్కెడునీళ్ళు పోయించుకోటానికి అభిమానపడి చచ్చే వాళ్ళం అయినా ఇప్పటి ఆడవాళ్ళకు బొత్తిగా సిగ్గు, లజ్జా లేవుకదా. మొగుడంటే చాకిరీ నౌకరన్న మాట. అందులోనూ చదువు కున్న వాళ్ళ నా కెందుకు మజ్జిగ పోయనా"

(కొద్ది రోజుల తరువాత)

"అబ్బ బాధ. కదల్లేనూ"

"ఉండండి అత్తయ్యా నే లేవతీస్తాను కాస్త జావ పుచ్చు కోరూ మరి నీరసం వస్తుందే" (అని కొంచం పోసిన తరువాత)

"అమ్మయ్య కాస్త ప్రాణం కుదుట పడిందమ్మా"

"కాస్సేపు పడుకోండి విసురు తాను"

"వద్దమ్మా వద్దు నువ్వు వెళ్ళి భోజనం చెయ్యి పొద్దు దేరిపోయింది, నాకోసం ఇంతసేపు కనిపెట్టుకు కూర్చు న్నావా?"

"మీకు బాధ తగ్గితే నాకేం శ్రమలేదు భోజనం నిమ్మ దిగా చెయ్య వచ్చు"

"అబ్బ ఆయాసంగా వుందే అబ్బాయి రాలా?"

"వచ్చే వేళయింది అదుగో మాటలోనే వచ్చారు నేవెళ్ళి త్వరగా భోజనం చేసి వస్తాను అందాక దగ్గర కూర్చుంటారు"

"కమలని చాలా బాధ పెట్టానురా"

"మరేం ఫరవాలేదమ్మా కాస్సేపు పడుకో మాట్లా

## ౦త్య విశ్వాసము

ఆయాసం ఎక్కువ వుతుంది.''

"పరాయి అమ్మ కన్న పిల్లకదా అని చాలా చులకన చేశాను"

" ...... .. ."

"ఏదీ కమల ఇంకారాలా .—అబ్బ — ఆయాసంగా వుంది నేనింక ఆట్టే సేపు బ్రతకను."

"ఏంమాటలమ్మా. పడుకో కాస్సేపు. అదేతగ్గుతుంది"

"కమలని కష్ట పెట్టకు నాయినా"

అంటూ కళ్ళు మూసింది ముసలమ్మ.

★

## లగ్నబలిమి (27-వ పేజీ తరువాయి)

హఠాత్తుగా విధిగా ప్రక్కకు కారును తప్పకోవాల్సి వొచ్చింది ఆతప్పుకోవడంలో ప్రక్కన ఎక్కువస్థలం లేకపోవటం వలన- రోడ్డుప్రక్కన చాలాలోతైన ప్రదేశం వుండటంవల్ల కారు పడిపోయింది డ్రైవరు. పద్మ, ఇంకోమనిషీ చనిపోయారు వెంటనే నాగేంద్రానికి దెబ్బలు తగిలినవి

అనుకోని ఈసంఘటనవల్ల జీవితాలు తారుమారైనై పద్మని వొళ్లోయిరికించుకొని చాలాసేపు కుమిలి కుమిలి యేడ్చాడు నాగేంద్రం. కాని యేంలాభం- పద్మ చనిపోయింది

ఎల్లుండి పెళ్లి. పెళ్లికొడుకు కనబడకపోవటంవల్ల నాగేంద్రం తలిదండ్రులు చాలా గాబరా చెందుతున్నారు. నలుగుర్ని నాలుగు దిక్కులకు పంపించారు.

పెళ్లిరోజుకి నాగేంద్రం వొచ్చాడు. తలకూ, చేతులకూ, మోకాలికీ కట్లుకట్టి వున్నాయ్. అందరూ ఆశ్చర్యపోయారు కారు ప్రమాదం సంగతి చెప్పాడు. కానీ, ఎందువల్లనో నాగేంద్రం ఆకారులో పద్మకూడా వుందని, మరణించిందనీ చెప్పలేదు

ఆరాత్రి పదకొండుగంటల యిరవైనిముషాలకు సక్రమమైన లగ్నానికే రాజేశ్వరితో నాగేంద్రానికి పెళ్లి జరిగింది. మరి లగ్నబలిమి !

★


# కిన్నెర

## సచిత్ర మాసపత్రిక

ఎడిటర్: పందిరి మల్లికార్జునరావు ★ అసిస్టెంట్ ఎడిటర్: పందిరి మీరాబాయి

ఆంధ్రాభ్యుదయానికి కంకణంకట్టుకున్న పత్రిక కిన్నెర ఆంధ్ర జనానీకం పత్రిక కిన్నెర ఆంధ్ర సేవకై పుట్టిన పత్రిక కిన్నెర మన సంఘం, మన ఆర్థిక. జీవనం, ఈ విషమ పరిస్థితులలో ఏవిధంగా పునర్నిర్మాణం కావలసిందీ, మన జీవిత సమస్యలూ, వాటిని యెట్లా పరిష్కరించ వలసినదీ వర్ణించే హృదయంగమములైన కథలతోను వినోదాన్ని, విజ్ఞానాన్ని చేకూరుస్తుంది కిన్నెర

భాష సాహిత్యం, శిల్పం, కళ, ఆర్థిక రాజకీయ విషయాలు, శాస్త్ర విషయక వ్యాసాలు, కథలు, నాటికలు మొదలైనవాటితో సర్వాంగ సంపూర్ణంగా ముచ్చటైన ఆకారంతో ప్రకటింపబడుతుంది

విడి కాపీ 6 అణాలు — సంవత్సర చందా 4 రూపాయలు.

మేనేజరు కిన్నెర, 16, జోన్సు స్ట్రీట్, మదరాసు-1.